నేటి నిజం
# సాహితీ కెరటాలు
E-mail : netinijam93@gmail.com
website: www.netinijam.com
2 హైదరాబాద్ ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 గురువారం 21-4-2022

## మినీ కవితలు

### జర జాగ్రత్త

వత్తి జారిపోతే
దీపం ఆరిపోతుంది
ఆత్మ విశ్వాసం కోల్పోతే
బతుకు జారిపోతుంది.

### దుర్మార్గుడు

మట్టిని పుట్టనుకొట్టి
చెట్టునుకొట్టి పశువును కొట్టి
బతుకుతున్నది
ఈ సృష్టిలో మనిషొక్కడే!

### కరువు

ఒకప్పుడు తాగడానికి నీరుండేది
ఏడవడానికి కన్నీరుండేది!
నేడు తాగడానికి నీరూ లేదు
ఏడవడానికి కన్నీరూ మిగల్లేదు?



- పి.లక్ష్మణరావు
సెల్: 9441215989

## ఘంటారావం

చిల్లు చిన్నదైనా
కుండను ఖాళీ చేస్తుంది
అనుమానం అణువంతైనా
హృదయాన్ని వేధిస్తుంది.

గుండెను గుచ్చిన మాట
ములికవుతుంది
గుండెలో చొచ్చిన మాట
మొలకవుతుంది

వ్యయానికి మించిన ఆదాయం
ఉన్నవాడు కుబేరుడు
ఆదాయానికి మించిన వ్యయం
ఉన్నవాడు కుచేలుడు



-గంటా మనోహర్‌రెడ్డి
సెల్:9949992964

# మంచి కథల 'పంచ్' తంత్రం






**ఈ నెల 25న రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు డా॥ కె.వి. రమణాచారి ఆవిష్కరిస్తున్న కవయిత్రి, రచయిత్రి శైలజామిత్ర రాసిన బాలల కథలు "ఆధునిక పంచ్ తంత్ర కథలు" పుస్తకానికి డా॥ పత్తిపాక మోహన్ రాసిన ముందు మాట ఇది.**
– సంపాదకులు

ప్రపంచ సాహిత్యంలో ప్రముఖమైన రచనల్లో 'పంచ తంత్రం' ఒకటి. భారతీయులు ప్రపంచ ప్రజలకు అందించిన అమూల్య కానుక ఇది. విష్ణుశర్మ సంస్కృతంలో రచించిన ఈ కథాగుచ్ఛం దాదాపు ప్రపంచంలోని అన్ని భాషల్లోకి అనువదించబడింది. తన వద్ద విద్యాభ్యాసానికి వచ్చిన విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేందుకు ఐదు విభాగాలుగా రాయబడ్డ పాఠ్య గ్రంథమిది. నేపథ్యాన్ని చూసినట్లయితే పూర్వకాలం అమరశక్తి రాజు ఉండేవాడు. అతనికి బహుశక్తి, అనంతశక్తి, ఉగ్రశక్తి అని ముగ్గురు కొడుకులు ఉండేవారు. చదువుసంధ్యలు లేక ఈ ముగ్గురు పరమ మూర్ఖులవలె తయారయ్యారు. ఒక మంత్రి విష్ణుశర్మ అనే పండితుడు ఈ ముగ్గురిని మార్చగలడని, అతని వద్దకు రాకుమారులను విద్యాభ్యాసానికి పంపమని సలహా ఇస్తాడు. రాజుగారి కోరిక మేరకు విష్ణుశర్మ మూర్ఖులైన ముగ్గురు రాకుమారుల్ని నీతిశాస్త్ర కోవిదులుగా తీర్చిదిద్దే బాధ్యతను స్వీకరించి వారికి బోధించవలసిన పాఠ్యప్రణాళిక కోసం కొన్ని కథలను స్వయంగా రచించి, మరికొన్ని బృహత్కథ నుండి గ్రహించి రచించిన గ్రంథమే పంచతంత్రం. రాజుకు ఇచ్చినమాట ప్రకారం ఆరు నెలల్లో రాకుమారుల్ని నీతిశాస్త్ర కోవిదులుగా తీర్చి దిద్దుతాడు విష్ణుశర్మ. ఇదంతా మనకు తెలిసిందే...

ఎప్పుడో ఎనభయ్యవ దశకంలో చదువుకుని, అప్పుడప్పుడు బాలలకు కథలు చెప్పే క్రమంలో పునఃశ్చరణ చేసుకున్న కథలు మళ్ళీ నాకు గుర్తుకు రావడానికి ప్రధాన కారణం శ్రీమతి శైలజా మిత్ర. ఆమె పిల్లల కోసం 'ఉషోదయ వెలుగు'లో రాసిన 'నేటి 'పంచ్' తంత్రం' కథలు. పదిహేను వందల సంవత్సరాల క్రితం విష్ణుశర్మ అయిదు విభాగాల్లో 69 కథలను జంతువులు పాత్రలుగా రాసాడు. జంతువులను పాత్రలుగా చేసుకుని శైలజా మిత్ర గారు రచించిన ఈ 'ఆధునిక 'పంచ్' తంత్రం'లో పదహారు కథలున్నాయి.

జంతువులను పాత్రలుగా చేసి కథను నడిపించే విధానం ఎవరికి నచ్చినా నచ్చకున్నా పిల్లలకు మిక్కిలి ఇష్టంగా ఉంటుంది. మనం మాట్లాడినట్లే ప్రతిరోజు వాళ్ళు ఎంతో ఉత్సాహంగా చూసే వివిధ రకాల సాధు జంతువులు, క్రూర జంతువులు మాట్లాడడం వంటివి మరింత ఆసక్తిని కలిగించడమే కాక వాళ్ళను జాగరూకుల్ని చేస్తుంది. వారి ఆలోచనా విధానంలో కొత్త కోణాల్ని ఆవిష్కరించడమే కాక సాటి ప్రాణులపట్ల పిల్లల్లో ప్రేమను మరితగా ఇనుమడింప జేస్తుంది. జంతువులు పాత్రలుగా ఉండడం వల్ల వాటి మనస్తత్వాలు, వాటి వాటి సహజ ప్రవృత్తులు, వాటి నడత, నడవడి కథల్లో మనకు తెలియజేయడంతో పాటు చదువుతున్నప్పుడు పాఠకులుగా మన ఊహాశక్తిని చాలాసార్లు పదునుపెడుతుంది. కాబట్టే పంచ తంత్రం వందల యేండ్లైనా మనల్ని తనవైపు తిప్పుకుంటూనే ఉంది. ఆకర్షిస్తూనే ఉంది. ఒక కాలానికి, ప్రాంతానికి ఈ పాత్రలు, కథలు పరిమితం కాలేదు కాబట్టే శైలజామిత్ర తన కథల్లోని పాత్రలకు జంతువులను ఎంచుకుని అద్భుతంగా మలిచారు.

శైలజామిత్ర గారు కవయిత్రి, రచయిత్రి, విమర్శకులు. దశాబ్దాలుగా నేను వీరి పేరును పత్రికల్లో, వివిధ మాధ్యమాల్లో చూస్తున్నాను. కవితలు, కథలు చదువుతున్నాను. నాకు తెలిసి శైలజామిత్ర గారి రచనలు అచ్చుకాని తెలుగు పత్రిక లేదనడం అతిశయోక్తి కాదు. వివిధ ప్రక్రియల్లో రచనలు చేసి తనదైన ముద్రను వేసిన శైలజామిత్ర పిల్లల గురించి రాయడం నాకు మరింత సంతోషాన్ని కలిగించింది. నేటి ఆధునిక తెలుగు రచయితల్లో లేదు కానీ తొలి తరం రచయితలంతా ఏదో ఒక సందర్భంలో పిల్లలకోసం రచనలు చేసారు. ఇతర భారతీయ భాషల్లో ప్రసిద్ధులైన రచయితలెందరో పిల్లల గురించి రాయడం మనం చూడొచ్చు. తెలుగు రచయితలు గత అయిదారు సంవత్సరాలుగా పిల్లల కోసం తమవంతు బాధ్యతగా రాయడం మనం చూస్తున్నాం. ఇది తెలుగు బాల సాహిత్య వికాసోద్యమంలో ఒక శుభపరిణామం. ఇదే కోవలో శైలజామిత్ర గారు తమ వంతు బాధ్యతగా పిల్లల కోసం రాయడం అభినందించాల్సిన విషయం.

మనకు తెలిసిన పంచతంత్ర కథల్లో సమాజం, నీతి, నిజాయితీ, ధర్మం మొదలగు అనేక విషయాలను రచయిత విష్ణుశర్మ ఒక లక్ష్యంతో చెప్పడం మనం చూస్తాం. రచయిత్రి శైలజామిత్ర గారు తమ 'ఆధునిక 'పంచ్' తంత్రం' కథలు మనకు చెబుతున్నప్పటికీ ఇందులోని ప్రధాన వస్తువు జంతువులు, వాటి సమస్యలు, సమస్యల పరిష్కారం కోసం చూపబడిన వివిధ మార్గాలు. మన పంచతంత్రం మూర్ఖులైన రాకుమారుల కోసం రాయబడితే, ఈ 'ఆధునిక 'పంచ్' తంత్రం' మూర్ఖంగా ప్రకృతిని సర్వనాశనం చేస్తూ జీవ జంతుజాలం మనుగడకు ముప్పుగా మానవులు చేస్తున్న అనేక విషయాలను జంతువుల నేపథ్యంగా మనతో చర్చిస్తారు.

జాతి, మత బేధాలు మనుషుల మధ్య ఎంత అగాథాల్ని సృష్టిస్తున్నాయో, జీవితాల్ని చిన్నాభిన్నం చేస్తున్నాయో మనకు తెలుసు. జాతి బేధపు అంశాన్ని ఇతివృత్తంగా తీసుకుని రాసిన కథ 'చిట్టి చిలకమ్మ' కథ. గద్ద చేతిలో మోసపోయిన చిలుక కథను ఇందులో చెబుతారు రచయిత్రి. 'పక్షులుగా మనలో అనేక జాతులుండచ్చు. కానీ మనలో విభేదాలను రేపుతున్నది మాత్రం ఆడ, మగ జాతులే' అంటారు. ఇంకో మంచి మాట కూడా రచయిత్రి ఈ సందర్భంలో అంటారు 'జాతిలో ఒక్కరు తప్పు చేస్తే మనం సరిదిద్దాలే తప్ప ఇలా వంతపాడకూడదు' అని. అడవిని గురించి, అడవిని కాపాడాలనే ఆలోచనల గురించి తెలిపే కథ 'చీమ–ఏనుగు.' ఒక అడవిలో ఎన్నో జంతువులు, ప్రాణులు ఉన్నాయి. వాటిలో ఒక చిన్న చీమ ఒకటి. ఆ చీమ రోజురోజుకు తరిగిపోతున్న వనాలను చూసి ఆవేదన చెందుతుంది. సింహం, ఏనుగు వంటి పెద్ద జంతువులను తన ఆలోచనతో ఎలా ప్రభావితం చేసిందో ఈ కథ తెలుపుతుంది. ఇటువంటిదే మరో కథ 'నిశ్శబ్ద చరణాలు' నెమలి, బాతు వంటివి ఇందులో ప్రధాన పాత్రలు. ఇందులోనూ అడవులను అంతంచేస్తున్న విధానమే వస్తువు. 'ఈ మానవులు చేసే విపరీతపు చేష్టలకు అంతు లేకుండా ఉంది. వారు సక్రమంగా బతకరు. మనల్ని ప్రశాతంగా బతకనివ్వరు' అని చిలక ఆవేదన చెందడం మనుషులందరికీ చెంపపెట్టులాంటి మాటే మరి. స్వేచ్ఛ మితిమీరితే అనర్థాలు జరుగుతాయని చెబుతూ 'పసి పక్షుల్ని కాపాడండి. అవి మీ బిడ్డలు కాకున్నా అందుకున్న నీరు, దొరికిన తిండి పంచండి. మనింట్లో ఆహారం మిగిలితే మరొకరికి అందించండి' అన్న సందేశం బాగుంది.

ప్రతి కథలో ఒక సందేశాన్ని అందించడం శైలజామిత్ర గారి రచనల్లో చూడవచ్చు. 'మృగరాజు తీర్పు'లో అదే కోవలో 'ప్రతి పుట్టిన రోజుకు ఒక మొక్క నాటండి' అనే సందేశాన్ని ప్రధానంగా చెబుతారు రచయిత్రి. 'జాతి సమైక్యత' కథ కూడా ఆలోచింపజేసే కథ. ఆపదలు ఎదురైనప్పుడు కలిసికట్టుగా ఉండి వాటిని ఎలా అధిగమించవచ్చో తెలుపుతుంది కథ.

ఈ కథల సంపుటి పేరు లాగానే ఇందులోని కథలన్నీ వివిధ సందర్భాలను 'పంచ్' లుగా తెలుపుతున్నాయి. రచయిత్రి పిల్లలకోసం రాసినప్పటికీ పిల్లలే కాదు పెద్దలందరూ చదవాల్సిన కథలివి. చాలావరకు మనం వదిలివేసిన అనేక అంశాలను రచయిత్రి వీటిలో చర్చించారు. చర్చించడంతోనే ఆగిపోకుండా చాలా కథల్లో ఆయా సమస్యలకు చక్కని పరిష్కారాన్ని చూపించే ప్రయత్నం చేసారు. ఈ పదిహేను కథల 'నేటి 'పంచ్'తంత్రం'కు స్వాగతం పలుకుతూ, మరిన్ని పిల్లల కథలను రాయాలని శైలజామిత్ర గారిని కోరుతున్నాను. జయహో! బాల సాహిత్యం.



-డా. పత్తిపాక మోహన్
తెలుగు సంపాదకులు & కార్యక్రమాధికారి
నేషనల్ బుక్ ట్రస్ట్ ఇండియా
మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వశాఖ, భారత ప్రభుత్వం

## జీవన వేదం

ఒక్కమాట చాలు కదా వేలవేల సూర్యచంద్రులు
వెలుగులు చిమ్మే పాలపుంతలూ
మనసు ప్రాంగణాన మచ్చిక చేసుకున్న కుక్కపిల్లల్లా
కనికట్టు చేసి కట్టిపడేసుకుందుకు

ఎప్పుడో పోగేసుకు పదిలంగా దాచుకున్న
అక్షర నిధులు సంచులకు సంచులు భుజాన వేసుకు
మధుమాసపు జాబిలి పూరెక్కల మధ్య మధువొలికినట్టు
కలల మాధుర్యాన్ని కలవరించేందుకు కళ వరించేందుకు
జీవన పరిమళాలు వంతెనలుగా పరచుకు
యుగాల తొలిదినం నుండే అన్వేషణ పయనంలో
ఒకరినొకరు పునః పరిచయం చేసుకు0టూ
పరిణయ గాథలు రాసుకు0టూ ఒకే రాగం ఆలపిస్తూ
ఈ దాగుడుమూతల ఆటలో ఒకరికొకరు దొరికిపోడం
ఇదే కదా ఒక జీవన వేదం



-స్వాతీ శ్రీపాద
8297248988

## నేటి దృశ్యం



### కేదారం-ఆధారం

ఇది ఒయాసిస్ కాదు
మనం మరచిపోయిన చెరువు
ఇది ఎడారి కాదు
అయినా మనం ఆహ్వానిస్తున్నాం!
ఇది కేదారాలకాధారం
ఇది కర్షకులు కాదంటారు
ఇది కడుపులో అన్నామృతం పోస్తుంది
అయినా మనం హాలాహలాన్నే కోరుతున్నాం



-కిలపర్తి దాలినాయుడు
7780589336




పుస్తక సమీక్ష

# సరళంగా రూపుదిద్దుకున్న 'తురాయి పూలు"!






**"కనురెప్పల మాటున దాచుకున్న కొన్ని చిత్రాలు అమాంతంగా కళ్లముందు నిలబడినప్పుడు సబ్బు నురగల బుడగలు గాలిలో తేలిపోతున్నట్లు మనసు గిలిగింతలు పెట్ట సందడి చేస్తుందంటూ"..** బాల్యంలోని మధుర జ్ఞాపకాలను అక్షరాల్లో నిక్షిప్తం చేసిన కవయిత్రి వాసరచెట్ల జయంతి తమ రెండో కవితా సంపుటిని 'తురాయి పూలు' పేరుతో మనకందిస్తున్నారు. మసకబారుతున్న మానవ సంబంధాలను.. అమ్మా–నాన్నలపై ఉన్న ఆత్మీయతానురాగాలను.. నింగి చుక్కలను చూస్తూ..తన జీవితపు లెక్కలకు వెలుగు రేఖలను కట్టే రైతన్నలను.. ఆకృతి దాల్చకుండానే పెదాల నుండి వెల్లువలా ప్రవహించే అక్షరాలను బంధువులతో పెనవేసుకున్న అనుబంధాలను.. మాయమై పోతున్న పల్లె జాడలను.. ఇలా అనేక అంశాలను వల్లె వేస్తూ కవిత్వాన్ని అల్లిన కవయిత్రి వాసరచెట్ల జయంతి. ప్రతీ కవితలో తమ సున్నిత మనస్తత్వాన్ని.. ఉత్తమ వ్యక్తిత్వాన్ని.. ప్రదర్శించే ప్రయత్నం చేయడం ప్రశంసనీయం..

నిప్పుల కుంపటి మోస్తున్న భూతల్లి దేహానికి చలువ పందిరివేసే నేతగాళ్లుగా రైతన్నలను అభివర్ణిస్తూ రాసిన పంక్తులు 'తురాయి పూలు' కవితలో చక్కగా ఒదిగిపోయాయి. రైతన్నలను ఉన్నతంగా చిత్రిస్తూ ఈ కవితలో పొందుపరిచిన ప్రతీ పంక్తి అందరినీ ఇట్టే ఆకట్టుకుంటుంది. గింజ గింజలను నేలకు అంకితం చేసి పచ్చని పైరుకు రెక్కలు తొడిగే రైతుల బతుకులకు అద్దం పట్టారు. గిట్టుబాటు కాని ధరలను చూసి కాలం కాలేదని సరిపెట్టుకుని.. వచ్చే యాడాది పంటకు సమాయత్తమయ్యే రైతన్నలను ఈ కవితలో ఆవిష్కరించిన తీరు బాగుంది.

2020లో 'నేల విమానం' కవితా సంపుటితో సాహితీ లోకంలో కవయిత్రిగా స్థిరపడి కవయిత్రి వాసరచెట్ల జయంతి.. ఇప్పుడు ప్రకటిస్తున్న 'తురాయిపూలు' గ్రంథంలో సరళత్వానికి పెద్దపీట వేశారు. స్పష్టతకు పట్టం కట్టారు. వస్తు ఎంపికలో తమ ప్రతిబను ప్రదర్శించారు. అభివ్యక్తితో కొత్త దనానికి పెద్దగా చోటు కల్పించకపోయినా.. అలతి అలతి పదాలతో తమ భావాలకు అక్షరాకృతినిచ్చారు.

శిల్పం విషయంలో మరింత శ్రద్ధ చూపించాల్సి ఉన్నప్పటికీ.. ఆమె ఉన్నత వ్యక్తిత్వాన్ని.. సామాజిక చింతనను తప్పకుండా అభినందించి తీరుతాం.

ప్రస్తుత ప్రపంచంలో గురుశిష్యులిద్దరూ తరాలకు విజ్ఞా వారసులనీ.. తల్లిదండ్రులు సహృదయ ప్రేక్షకులనీ.. అప్పుడప్పుడూ వల్లెవేస్తున్న కొన్ని అక్షరాలు.. అపశృతులు పలికినప్పటికీ.. అది వాటి తప్పుకాదని ఆచరించే వ్యక్తులదే తప్పు లని తేల్చి చెప్పారు. తేజోమూర్తిగా భాసిల్లే గురువు చేతిలోని సుద్దముక్క నిరంతరం కొన్ని అక్షరాలను సృష్టించి.. జ్ఞాన జ్యోతులను వెలిగిస్తూనే ఉంటుందంటూ గురువుల పట్ల తమ గౌరవాన్ని చాటుకున్నారు.

'బాల్యాన్ని భుజానమోస్తూ' కవితలో బాల్య జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ.. స్వచ్ఛమైన స్నేహం పలకా బలం పట్టుకుని అక్షరాలు దిద్దిన నాటి నేస్తాలదే అంటూ మంచి ముగింపునిచ్చారు.

'అమ్మా... బాపూ" కవితలో అమ్మా బాపులకు ఒకరిపట్ల ఒకరికి ఉన్న నమ్మకాన్ని ఆవిష్కరించారు. ఎన్నో ఉప్పెనలాంటి కష్టాలు.. వారి బతుకు చుట్టు తిరిగినా.. ఏనాడూ బాపు మాట అమ్మ జవదాట లేదని.. పురికొసలాగా కలిసి మెలిసి కష్టాల కొలిమిలో నడుస్తూనే ఉన్నారంటూ రాసిన పంక్తులు బాగున్నాయి.

'చివరి మజిలీ' కవితలో కవయిత్రి తమ తాత్త్వికను చాటుకున్నారు. కాచి వడపోసిన జీవితపు మాధుర్య ఫలాలను తన వారికి వదిలి.. శాశ్వత మజిలీని వెతుక్కుంటూ.. మరో శరీరంలో జీవిత ప్రయాణం మొదలు.. ప్రతిక్షణాన్ని పరిపూర్ణం చేసుకునే వారికి చివరి మజిలీ ఓ గొప్ప అనుభూతి అని అభిప్రాయపడ్డారు.

జీవితంలోని నిరాశా నిస్పృహలను వదలి ప్రపంచంలోని ప్రేమను చాటి చెప్పిన రవీంద్రనాథ్ ఠాగూర్ గురించి 'విశ్వకవి' కవితలో పొందుపరిచిన పంక్తులు బాగు న్నాయి. శ్రమైక సౌందర్యాన్ని గీతాంజలి కావ్యంతో లోకానికి అందజేశారంటూ రవీంద్రుని కొనియాడారు.

పరుచుకున్న నిశీధి దుప్పటిని తీసేస్తూ గుప్పిట పట్టిన వెలుగు రేఖలు ఆత్మీయంగా అల్లుకుపోతున్నాయంటూ.. 'క్రాంతి దర్శనం' కవితను ఎత్తుకున్న తీరు బాగుంది.

జాతీయతను నడిపించే మరణం లేని వీరుడిగా అభివర్ణిస్తూ నేతాజీ సుభాష్ చంద్రబోస్ గురించి రాసిన 'ఆజాద్‌హింద్ ఫౌజ్' కవిత బాగుంది.

'నగరం నిద్రపోతున్న వేళ' కవితలో నగర జీవితానికి. నగర వాతావరణానికి అద్దం పట్టారు. నగరంలో.. హంగులతో కూడిన రంగుల జీవితాల మధ్యే.. కాలే కడుపుల డొక్కలకు పిడికిళ్లు నొక్కుకుని బ్రతికే జీవితాలను ప్రస్తావించిన తీరు అభినందనీ యంగా ఉంది.

చీకటి చిత్రంగా వచ్చి...

నా బుగ్గలు నిమిరినప్పుడు.. కన్నులపై మత్తు పరదాలుపడి నిద్ర పొత్తిళ్లలో ఆదమరిచానంటూ 'తుషార సందేశం' కవితను చక్కగా ప్రారంభించారు.

జీవిత సంఘర్షణల నడుమ నలిగి వెలువడిన అగ్ని కణంగా శ్రీశ్రీని పేర్కొంటూ 'సాహితీ శిఖరాగ్రం' కవితను తీర్చి దిద్దారు. "వేయి గొంతుకలైన అక్షరం' కవితలో.. అందరి గోడూ అతని గొడవైందనీ.. అన్యాయం అంతరించే దాకా ఆగని గొడవ అతనిది అంటూ 'కాళోజీ' పట్ల కవయిత్రి తమ గౌరవాన్ని చాటుకున్నారు.

'అమ్మ సంతకం' కవితలో అమ్మతో పెనవేసుకున్న అనుబంధాన్ని.. చిన్న నాటి స్మృతులను.. ఏకరువు పెట్టారు. అమ్మ కొంగు పట్టుకుని అస్తమానం తిరిగే నేను.. నేను అమ్మలా అన్నీనేర్చుకుందామని ఎంత ప్రయత్నించినా అబ్బలేదు. అమ్మ అయ్యాకగానీ తెలియలేదు. ఆత్మీయమైన అమ్మ ప్రేమ సంతకాన్ని ఫోర్జరీ చేయడానికి రాదని చక్కని ముగింపునిచ్చారు. అమ్మ యొక్క గొప్పదనాన్ని చాటి చెప్పారు.

ఈ కవితా సంపుటిలోని మొదటి కవిత 'ప్రేమ పతాకం' సైనిక దంపతుల అనుభవాలను అనుభూతులను ఆవిష్కరిస్తూ రాసినప్పటికీ.. మిగతా దంపతులకు వర్తించేలా పదబంధాలను కూర్చారు. అవును మనమిద్దరమూ దేశభక్తులమే భరత మాత నుదుటన మన ప్రేమ పతాకం చిరకాలం రెపరెపలాడుతూనే ఉ ంటుందని చెప్పడం బాగుంది.

ఇలా ఈ గ్రంథంలోని కవితా పంక్తులు మరెన్నో ఉదహరించడానికి యోగ్యంగా ఉన్నాయి. చాలా కవితలో కవయిత్రి లోక పరిశీలనా పటిమను చాటేలా కొలువు దీరాయి. అక్కడక్కడా కవిత్వాంశ కొరవడి.. పూర్తి వచనంలా సీదాసాదాగా కనిపించినప్పటికీ.. కవయిత్రి వాసర చెట్ల జయంతి ప్రస్తావించిన అంశాలను ప్రశంసించి తీరుతాం.. కవిత్వానికి గుప్తత.. క్లుప్తతం.. ఆభరణాలున్న విషయాన్ని.. గ్రహించి.. మరింత గాఢమైన కవిత్వాన్ని మున్ముందు మనకందిస్తారన్న విశ్వాసం ఉంది. వి.జి. చందన గీసిన ముఖచిత్రం పుస్తకానికి నిండు శోభను కూర్చింది..

ప్రతులకు: వి. మరోహర్
సెల్: 9985525355



– దాస్యం సేనాధిపతి
సెల్: 94405 25544



ఏప్రిల్ 5న గుంటూరు జిల్లా పొత్తూరులో సాహితీకిరణం బ్రాంచి కార్యాలయంలో సాహితీకిరణం నిర్వహించిన కార్యక్రమంలో కుమ్మమూరి సుబ్బాయమ్మ రచించిన 'ఎదురీత' నవలను మాజీ పార్లమెంటు సభ్యులు మోదుగుల వేణుగోపాలరెడ్డి ఆవిష్కరించారు. చిత్రంలో జానీబాషా, పి.వి. సుబ్బారావు, వి.వి. రాఘవరెడ్డి, ఎన్వీ. రఘువీర్‌ప్రతాప్,జన్నాభట్ల నరసింహప్రసాద్, రమణ వెలమకన్ని, పొత్తూరి సుబ్బారావు, విడదల సాంబశివరావు, పెద్దూరి వెంకటదాసు.




ప్రజలకు వాగ్దానం
పరిశుభ్ర ఆహారం
పండించే రైతుకు
పస్తులే బహూమానం

అన్నదాత కేక
ఇంక అందేదేమో 'పైకి'
కనికరం లేదేమో
చెవిటి మేఘానికి

ఆ గొడవలో వున్నది
సామాన్యుడి 'గోడు'
'కాళోజీ' అక్షరం
అగ్నిగోళం 'స్పీదు'

'పారు'తోంది ఏరులా
ఇంతకన్నా నీచులు
జనాన్నే వేటాడే
జనతంత్రపు నేతలు

తరగతి గదే
విద్యార్థి సంస్కృతికి పునాది
అధ్యాపకుడే
అందుకు జవాబుదారీ

దళారీల దాష్టీకం
బతుకు భయం, రైతుకు
ఎంత పంట పండినా
నోటికందదు మెతుకు



-మాయకుంట్ల నారాయణరెడ్డి
9989686603

## మాదేశి రాజేందర్‌కు ఉగాది పురస్కారం



బీసీ సంక్షేమ సంఘం గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు ముషీరాబాద్‌కు చెందిన మాదేశి రాజేందర్‌కు సకల జనుల సేవా సమితి ఆధ్వర్యంలో ఉగాది పురస్కారం–2022ను ప్రదానం చేశారు. మంగళవారం రవీంద్రభారతిలో జరిగిన పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర టూరిజం డెవలప్‌మెంట్ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా, ప్రముఖ సినీ హీరో సుమన్, బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్, బీసీ సంక్షేమ సంఘం మహిళా కమిటీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సకల జనుల సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షురాలు మణి మంజరిలు పాల్గొని ఈ పురస్కారాన్ని బహూకరించారు. రాజేందర్ మాట్లాడుతూ బీసీల ఐక్యత, సమస్యల పరిష్కారం, న్యాయమైన హక్కుల సాధన కోసం కృషి చేస్తున్నందుకు ఈ పురస్కారం ప్రదానం చేశారని పేర్కొన్నారు.



ఏప్రిల్ 8న జ్యోత్స్న కళాపీఠం హైదరాబాద్ శ్రీ త్యాగరాయ గానసభ కళా సుబ్బారావు కళావేదికలో నిర్వహించిన శ్రీ శుభకృత్ నామ సంవత్సర ఉగాది సాహితీ పురస్కార ప్రదానోత్సవం 2022 కార్యక్రమంలో పత్రికారంగం నుండి ఉగాది పురస్కారం అందుకుంటున్న పొత్తూరి సుబ్బారావు. చిత్రంలో డా॥ అనిల్‌కుమార్, డా॥పోతుకూచి, భట్టీశ్వర శర్మ, ఆచార్య టి. గౌరీశంకర్, డా॥ మంజులత, ఆచార్య కె. కుసుమాబాయి.






ఒక
'స్నేహ' పూర్వక వాక్యం
అర్థాంతకంగా ఆగిన–
కలం
కన్నీరు పెడుతుంది!
గుండె
సముద్రమై
ఘోషిస్తుంది!!



-డా॥విప్లవ్‌దత్ శుక్లా
సెల్:9849185878

## రంగులమయం

నీవెళ్ళే దారిలో
హరివిల్లులనలా వదిలేస్తావేం
కాస్త మనసు పెట్టి ఆహ్వానించుకో!

అందమైన శరీరానికి
అనుకోని అధిపతివేగా
వర్ణం లేని కన్నీళ్ళకు
విలువిచ్చి వివర్ణమవుతావెందుకు?

అర్థం లేని ప్రాణం
ఆకారం లేక చుట్టూ వీస్తుంది
అనుభవించడానికి
మన జీవితమే మిగిలి ఉంది

ఊహించని ప్రయాణం
ఎప్పుడో మొదలైపోయింది
ఊహకందని ప్రపంచం
ఉక్కిరిబిక్కిరి చేస్తుంది
అయినా రంగుల నావగట్టి తిరిగేద్దాం!

ఉనికి కోసం ఉఛ్వాస నిశ్వాసలతో
గాలి నీ బండి ఎక్కింది
బతుకు కొమ్మకు పువ్వులెన్ని వేసి
పరిమళమెంత మూట కడతావో కదా!

కష్టాలే కదా చల్లుకుందాం
సుఖాలేగా విసురుకుందాం
మొత్తానికి
రంగులమయమై పోదాం!



-నల్లు రమేష్,
9989765095

## విశ్వరూపం

ఒకప్పుడు
అందరి చదువులకు గొడుగుపట్టిన
పాఠశాల గోపురం
పిల్లలు రాక నిశ్శబ్ద రోదనా పర్వం.

టోన్ జీన్స్ షార్ట్ లెంతుల
కనుబొమ్మల విధ్వంసంతో
అసంబద్ధ కేశఖండనల చెవిపోగుల
వెటకారపు వేషధారణ పర్వం.

మూగనోము
మౌనవ్రతం
సమాధానమివ్వలేని
నిన్న కనిపించినవాడు
నేడు కనిపించని సభికుల మాయ పర్వం.

నిన్న చెప్పింది ఈరోజు
ఈరోజు చెప్పింది రేపు
అప్పగించని అనుసరించని
మహా సోమరి పోతుల పర్వం .

నిప్పుల్లో కాల్చుకూడదు
సుత్తి దెబ్బలు తగిలించకూడదు
బంగారం ఆభరణమయ్యేదెట్లనో చెప్పని
వార్తా ప్రసారాల కథనాల పర్వం.

అంతా నిర్లక్ష్యం
అలసత్వం అనాలోచితం
మనకెందుకులేననుకుంటూ
ఏమీ చేయకుండా
బానిసత్వపు దిగజారుడు పర్వం.

క్రమశిక్షణను ప్రశ్నిస్తూ
నైతిక విలువలు
నియమ నిబంధనలు ఉల్లంఘిస్తూ
తల్లిదండ్రుల వితండ వాదనా పర్వం.

అన్ని అస్త్ర-శస్త్రాలున్నా
శక్తి యుక్తులున్నా
పాఠం బోధించలేనంత
గైర్హాజరు శూన్య పర్వం.

పాఠాన్ని
పరవళ్ళ తొక్కుస్తూ
అజ్ఞానపు బీడులను
పండించలేని అచేతన పర్వం.

పట్టించుకుంటే
ఆలోచిస్తే
ఆశలు చిగురించక
కంటిమీద కునుకు పట్టని
అంధకార పర్వం.

జరగబోయే అనర్థమర్థమైనా
ఏమీ చేయలేక
సహాయం కోసం
నిరీక్షిస్తున్న సంఘర్షణ పర్వం.

అధర్మాన్ని
అధర్మమని చెప్పలేని
నిరూపించలేని
చేష్టలుడిగిన శిథిల మనస్తత్వ పర్వం.

ఉద్యోగమంటే
పగలు రాత్రి
సంతృప్తి పడని మానసిక స్థితి
జీతాన్ని
పదిమందిలో చెప్పుకోలేని అగౌరవ పర్వం.

చదవడం రాయడం రాకున్నా
ఉత్త పౌరులను ఉత్తీర్ణులని
పరీక్ష ఫలితాలు
ప్రకటించుకునే కర్త కర్మ క్రియా పర్వం.

ఉత్తమ పౌరులు
మంచి సమాజం
ఆశించడం కలగనడం
కోరుకోవడం వృథా ప్రయాస పర్వం.

చెదలు పట్టిన
వ్యవస్థ బుద్ధిని
జాగృతం చేయడం కోసం
ధర్మ సంస్థాపనార్థం
అత్యవసరమవుతున్న సంస్కరణల పర్వం.

పాలనా యంత్రాంగం
అసంబద్ధ నిర్ణయాలతో
చీదరించుకుంటూ
చులకనచేయబడుతూ
ఉద్యోగులపై బురదజల్లే పర్వం.

ఎన్ని తెలివితేటలున్నా
తెల్లని మూటగట్టి
అజ్ఞానులుగా వనవాసం వెళ్లదీస్తూ
పాలనా పగ్గాలు ఉరితాళ్లు పేనుతున్నా
నిశ్చేష్టులుగా విధించుకుంటున్న
స్వయం మరణ దండనా పర్వం.



– అశోక్ చిన్నం
7989875763

---

కరోనా కథలు

## ఋణం

(కథ)

అప్పటికే వందల సంఖ్యలో క్వారెంటెన్ వార్డులో పేషెంట్లను అడ్మిట్ చేస్తూనే ఉన్నారు. నేను డాక్టర్ సత్యం ఇద్దరం గాంధీ హాస్పిటల్‌లో డ్యూటీలో ఉన్నాము.

సత్యం ఉన్న వార్డులోకి ఒక రోజు ఏదో పని మీద నేనే వెళ్ళా తీరా సత్యం ట్రీట్మెంట్ చేస్తున్న ఓ పెద్దాయన్ని చూసి, తనను ఎక్కడో చూసినట్టనిపిస్తోంది. కానీ వారు ఎవరో వారి పేరేమిటో గుర్తుకు రావడం లేదు. వారిని అలాగే తదేకంగా చూస్తూ నిలబడిపోయా ఇది గమనించిన డాక్టర్ సత్యం.

"మేడం సరస్వతి దేవి గారు అదేంటి.." అన్న పిలుపుతో గాని నేను తేరుకోలేదు.

"ఏం లేదండీ" అని చెప్పి అక్కడి నుండి వెళ్ళిపోయా.

కానీ లంచ్ టైంలో మళ్ళీ ఆ పేషెంట్ విషయాలు నెమరు వేసుకుంటూ "సర్ సత్యంగారు నేను వచ్చినపుడ మీరు ట్రీట్మెంట్ చేస్తున్నారే ఆ పేషెంట్ల పేరేంటో.." అని అడిగా.

"వారి పేర్లు గుర్తు లేదండీ కానీ.. ఆ పెద్దాయన పేరు మాత్రం అదేదో.. స..స..స"

అతని మాట పూర్తిగాక ముందే " ఆ గుర్తుకు వచ్చింది తన పేరు సర్వేశ్వరరావు.."

"ఆ అవును మేడం, ఆ పెద్దావిడ మీరు మీనాక్షి"

"అవునవును అదే.."

"ఏంటి?.. వాళ్ళు మీకేమైనా బంధువులా?"

"డాక్టర్‌గారు మీరు బంధువుల కన్నా మిన్నే తెల్సా! అవును నాకు దాదాపుగా 5,6 సంవత్సరాల వయస్సు ఉండవచ్చు. వారు మేము పక్కపక్క ఇంట్లోనే అద్దెకుండే వాళ్ళం. అప్పటికి వారికి సంతానం లేదు. నన్ను ఎంతో ప్రేమతో ఆప్యాయతతో చూసుకునేవారు. అప్పుడప్పుడు నాకు జడలేసి తన ముద్దూ ముచ్చట తీర్చుకునేది ఆ ఆంటీ. మా నాన్న రైల్వేలో అప్పర్ గ్రేడ్ క్లర్క్. అంకులేమో బ్యాంకులో మేనేజర్‌గా చేసేవారు మా ఇద్దరి కుటుంబాలు ఎంతో అన్యోన్యంగా ఉండేవి.

ఒకరోజు నాన్న డ్యూటీ నుండి వస్తుంటే ఆక్సిడెంట్ అయి చాలా ప్రమాకర స్థితిలో ఉన్నాడు. ఆ ప్రమాద స్థితిలో ఉన్న నాన్నగారికి అనేకరకాలుగా ఆదుకుని మాకు ఎనలేని సహాయాన్ని అందించి మా అనుబంధాన్ని మరింతగా పెనవేసుకున్నాడు ఈ అంకుల్ ఆంటీలు".

"అంటే మీరు చాలా చక్కని అనుబంధాలు ఉన్న వారన్నమాట. మరి ఇన్నేళ్ళు మీరు ఒక్కసారి కూడా కల్సుకోలేదా?"

"లేదు నాన్నకు వైజాగ్ ట్రాన్స్‌ఫర్ అయ్యింది. అంకులేమో హైదరాబాద్‌కు ట్రాన్స్‌ఫర్ అయ్యింది. అప్పుడప్పుడు నాన్న హైదరాబాద్ కెళ్తే కల్సి వచ్చేవాడటలే..

"మిమ్మల్ని చూస్తే వారిప్పుడు గుర్తు పడతారా?"

"ఏమో గ్యాప్ ఎక్కువైంది కదా చూద్దాం"

"అది సరే మేడం ఇప్పటికే చాలా లేటు అయ్యింది వెళ్దామా" అని ఇద్దరం లంచ్ ముగించుకుని డ్యూటీలోకి వెళ్ళాం. తీరా వారినిప్పుడు క్వారెంటైన్ నుండి ఐసోలేషన్ వార్డుకు మార్చారు.

వృద్ధ దంపతులతో చనువు ఏర్పరచుకున్న సత్యం ఒక రోజు "అంకుల్ మీకెంత మంది పిల్లలూ.." అని అడిగాడు.

"ఇద్దరు బాబు! కవలలు ఇద్దరి కిద్దరు స్టేట్స్‌లోనే ఉంటున్నారు."

అంకుల్ మాట పూర్తవక ముందే "అదేంటి? పాప సంగతి మరిచారా.. నేను మరిస్తే నేమో మీరు గుర్తుచేస్తారు.. మీరేమో.." అని అంటీ అంటుంటే..

"అవునవును సరస్వతీ దేవి.."

"అది సరే ఆంటీ ఇపుడు ఆ సరస్వతీ దేవి కనబడితే గుర్తు పడతారా"

"ఏస్టీ మా సరమ్మనా! ఎక్కడుంది? ఎందుకు గుర్తు పట్టం తప్పక..ఆ బుగ్గ మీద పుట్టుమచ్చ.."

ఇలా అంటున్నంతలోనే నేను అక్కడికి వెళ్లా.. నన్ను చూడడంతోనే "అంకుల్ ఇదిగో మీ.." అని డాక్టర్ సత్యం చెప్తుండగా.

నా వైపు చూసిన ఆంటీ "అమ్మా సరూ!" అంటూ ఎంతో సంతోషపడి నన్ను తన ఎదకు హగ్ చేసుకోబో తుంటే

"ఆంటీ ఇది హత్తుకునే టైం కాదు. మీ ఆరోగ్యం బాగై డిశ్చార్జ్ అయి ఇంటికి వెళ్ళిన తర్వాత. అంతవరకు దూరం నుండే నమస్కారం. మనం ఈ సంస్కారం పాటిద్దాం" అని నేను చెప్పా..

"అమ్మా! సరస్వతీ" అని ఆనందభాష్పాలు నిండిన కన్నులతో నా వైపు చూస్తోంది ఆ పెద్దావిడ.

"ముందు మీరు మానసికంగా ధైర్యంగా ఉండండి మేమున్నాం' అని ధైర్యం చెప్పడానికి ప్రయత్నిస్తుంటే

డా॥ సత్యం కల్పించుకుంటూ "అంకుల్ మీ ఇంటి చుట్టు పక్కలకి బయటి వారెవరైనా వచ్చారా? లేకపోతే ఎవరికైనా..?"

"ఎవరూ రాలేదు డాక్టర్‌గారూ, మా అబ్బాయిలిద్దరూ స్టేట్స్‌లో ఉంటారు కదా! వారేదో అందమైన ఒక బొమ్మను అక్కడ ఉండే వాళ్ళ ఫ్రెండ్ ఇండియా వస్తుంటే అతనితో పంపారు.

ఆ అబ్బాయిని ఇంట్లోకి కూడా రానివ్వలేదు దాన్ని బయటి నుండే తీసుకున్నాం" అని ఆంటీ చెప్తుంటే

ఆ అబ్బాయి ముందే ఫోన్ చేశాడు "కవర్ తీసుకొని వస్తున్నాను" అని.

అయినా ఆకాడికీ చెప్పా "బాబూ! అదేదో కరోనా వూరస్ వ్యాప్తి చెందుతుందని అపరిచితులను, కొత్త వారినీ, ఎవరినీ రానీయంగూడదూ. వారినీ తాకగూడదూ, వస్తువులేమైనా తెస్తే తీసుకోరాదని నిన్ననే టీవీల్లో యాడ్ చూశా. వద్దూ మరెప్పుడైనా తీసుకుంటాంలే.." అని చెప్తూనే ఉన్నా ఇదిగో విశాలాక్షి వింటే కదా!

"ఇదిగో ఈ బొమ్మ డ్యాన్స్ చేస్తోందట' అని ఫోన్ లాగేసుకొని రమ్మని మరీ చెప్పింది. అలా వచ్చి ఆ బాబు తెచ్చి ఇవ్వగానే పాకెట్ విప్పి ఆ బొమ్మ చేసే విన్యాసాలు చూస్తూ ఆనందంగా ఆ రాత్రంతా గడిపాము. ఇంకేముంది మొదలైంది విశాలాక్షికి జలుబు, జ్వరం, దగ్గుడూ, తుమ్ముడూ. దీంతో ఇంట్లో ఉన్న మాత్ర వేసుకుంటే కాస్త తగ్గడం ఆ తర్వాత మళ్లీ అవే లక్షణాలు. నాక్కూడా మొదలు కాగానే ఏదో ప్రమాదం పొంచి ఉందని అనుమానం వచ్చి ఉదయం లేవగానే మాకు పరిచయం ఉన్న డాక్టర్‌గారికి ఫోన్ చేసి చెప్పా"

ఆయన "అర్జెంటుగా సివిల్ హాస్పిటల్‌కి వెళ్ళండి లేట్ చేయకండి అనడంతో వెంటనే ఇద్దరం హాస్పిట్‌కి వచ్చేసాం ఇదీ పరిస్థితి" అని సర్వేశ్వర్రావ్ చెప్తుంటే..

"ఫరావాలేదు మంచి పనే చేశారు. ధైర్యంగా ఉండండి అంకుల్" అని నేను చెప్పా.

"సరే అమ్మ డాక్టర్ రూపంలో వచ్చిన దేవతవు తల్లీ! అయినా మీరంతా వైద్యుల రూపంలో ఉన్న దేవుల్లే కదమ్మా!"

"అలా అనకండి అంకుల్, మీరు మా కుటుంబానికి చేసిన సాయానికి ఆ దేవుడు నన్ను మీ ఋణం తీర్చుకోవడానికి ఇలా పంపారేమో. అయినా అంకుల్ మీరు బాధపడాల్సిన అవసరం లేదు. తొందరగా వ్యాధి కంట్రోల్ అయి డిశ్చార్జి అవుతారులే. మీరు తెలుసా ఈ వైరస్ చేతుల ద్వారా నోటి ద్వారా ముక్కుద్వారా చేరుతుంది. ముఖ్యంగా ఈ వైరస్ సోకిన వారితో అతి దగ్గరగా ఉండి మాట్లాడినా, కరచాలనం చేసినా వారు వాడిన వస్తువులు మనం వాడినా తాకినా ప్రవేశిస్తుంది. ఆయా వస్తువుల లక్షణాలను బట్టి నాలుగు గంటల నుంచి నాలుగు రోజుల వరకు కూడా బతికే ఉంటుంది వైరస్. ముందు గొంతులోకి చేరి ఓ వారం రోజులు గొంతులోనే ఉంటూ తర్వాత తర్వాత మెల్లిగా శ్వాస కోషంలోకి ప్రవేశిస్తుంది. దీని ప్రభావంతో ముందుగా జలుబు జ్వరం నీరసం దగ్గు మొదలైన లక్షణాలు కలుగుతాయి. కాస్త పుంజుకున్న తర్వాత శ్వాస నాళం ద్వారా ఊపిరితిత్తుల్లోకి చేరి మెల్ల మెల్లగా ఊపిరితిత్తులను ఆవరించి శ్వాసకు అడ్డు పడుతుంది. ఆ తర్వాత ప్రాణాన్ని కూడా హరించేస్తుంది.

ముఖ్యంగా రోగ నిరోధక శక్తి తక్కువగా ఉన్న వారికి తొందరగా సోకడానికి ప్రయత్నిస్తుంది. అందువల్ల వయస్సు మీద పడిన వారు అంటే 60 ఏండ్లు మీద పడిన వృద్ధులకు, డయాబెటిక్ ఉన్న వారికి, హార్ట్ ప్రాబ్లం, దగ్గు దమ్ము ఉన్న వారికి లేదు. వయస్సులో ఉన్న పిల్లలకు ఇది గనక సోకితే ఎక్కువ ప్రమాదకరం. ఎందుకంటే వీరిలో వ్యాధి నిరోధక శక్తి చాలా తక్కువగ ఉంటుంది కనుక. ఎన్నిసార్లు చెప్పినా వినిపించుకోకుండా ఉండే వారికే ఇది సోకుతుంది. అదే పరిశుభ్రత ఆరోగ్య నియమాలతో ప్రభుత్వం చెప్పే భౌతిక దూరంతో బాటు గడప దాటకుండా, మాస్కులు ధరిస్తూ ఇలా ఇవన్నీ పాటించిన వాళ్ళకు ఏం కాదు.. మీరు త్వరలోనే ఈ వ్యాధి నుంచి డిశ్చార్చి అయి ఇంటికి వెళ్లిపోతారు ఆంటీ. మీకు ఏం కాదులే" అని నేను అన్ని జాగ్రత్తలు చెప్పా.

"మానసికంగా హుషారుగా ఉండండి.. సరస్వతీ దేవి మేడం కనబడగానే మీలో మానసిక ఆనందం కలిగి ఉంటుంది. మానసిక ఆనందంతోనే మీలో సగం వ్యాధి దూరమయి ఉంటుంది" అని డా॥ సత్యం చెప్పసాగాడు.

"అవును సార్. మీరన్నది నిజమే. డాక్టర్ మేడంను చూడగానే మాకెంతో ఉల్లాసం అనిపిస్తోంది" అని అంకుల్ అంటుంటే..

"అవునమ్మా! ఒకసారి తమ్ముళ్ళకు ఫోన్ చేయవమ్మా! సరక్కా! సరక్కా"! అని ఊరికే గుర్తు చేస్తుంటారు" అని ఆంటీ చెప్తుంటే..

"సరే నేను ఫోన్ చేస్తాను కానీ.. నాట్ నౌ.. ఒకేనా మీరు మాత్రం ప్రశాంతంగా హాయిగా ఉండండి మీకేం భయం లేదు ఆంటీ" చెపుతూ ట్రీట్‌మెంటు స్టార్ట్ చేశాం.

నాకు మాత్రం లోలోపల ఎంతో ఆనందంగా ఉంది. మా నాన్నకు నా కుటుంబానికి వారు చేసిన సహాయానికి ఈ విధంగానైనా ఋణం తీర్చుకుంటున్నానని..

**నాకు మాత్రం లోలోపల ఎంతో ఆనందంగా ఉంది. మా నాన్నకు నా కుటుంబానికి వారు చేసిన సహాయానికి ఈ విధంగానైనా ఋణం తీర్చుకుంటున్నానని..**



-దారం గంగాధర్
సెల్:9848384777

---

## నానీలు

అజ్ఞానపు చీకటికి
విజ్ఞానం పంచి
విద్యా కుసుమానికి
బాటలువేయ్యి.

వృషభం కొండల్లో
రుధిరమై
వెలుగుతున్నాడు
భానుడు బందీయై

మోట బావి
మాయమయింది
సాంకేతిక పరిజ్ఞానం
మింగేసింది

అహంకారంతో
అల్టిమేటం
పశ్చాత్తాపంతో
పాలాభిషేకాలు



-చాపలమహేందర్
9949864152

## యుద్ధ మేఘాలు

యుద్ధం గురించి
క్రొత్త గా ఏమి వ్రాయాలి
యుద్ధం గురించి
క్రొత్తగా ఏమి చెప్పాలి
ఎటుచూసినా మానవ కళేబరాలు
ఎటుచూసినా దుఃఖపు ఛాయలు.

ఒకరు గెలుపొందుతారు
ఒకరు ఓటమిపాలౌతారు
కొన్ని సార్లు ఎవరు గెలవరు
కొన్ని సార్లు ఎవరు ఓడిపోరు
బట్టలు చింపుకొని వెనుతిరుగుతారు.

యుద్ధం గురించి క్రొత్తగా
ఏమి వ్రాయాలిఏ చరిత్ర చూసినా
ఏమున్నది గర్వ కారణం
నరజాతి సమస్తం పరపీడన పరాయణత్వం

ఎంతకి తీరని ఉన్మాదం
ఎంతకి తీరని రక్తదాహం
ప్రాణానికి ప్రాణం రక్తానికి రక్తం
ఇదెక్కడి యుద్ధ ధర్మం.

అమాయకమైన మనుషుల భయాందోళన
పసిహృదయాలపైన పగ ప్రతీకార భావన
కష్టతరమైన మనుషుల మనుగడ
ఆగేది ఎపుడు ఈ రగడ.

నివాసాలు కోల్పోయిన మానవులం
నిలువనీడలేని బాల్యం
దోచుకోబడిన యవ్వనం
తెగిపోయిన తాళి బంధనం
ఇంకా ఏమి మిగిలింది
శవాలదిబ్బలు తప్ప
రక్తపుటేరులు తప్ప



-అరుణ డేనియల్
9000606889

## ప్రపంచం అరచేతిలో

(కథ)

అమ్మా! అమ్మా!గట్టిగా అరుస్తూ ఇంట్లోకి అడుగు పెట్టాడు 5వ తరగతి చదువుతున్న రవికాంత్.ఏమైందో ఏమో అని గాభరా పడుతూ పరుగున వచ్చింది అనిత.ఏంట్రా ఏమైంది ఎందుకలా అరుస్తున్నావు అని అడిగింది.వెంటనే ఏడవటం మొదలు పెట్టాడు... ఇంకా గాభరా ఎక్కువైంది..సముదాయించాలని అతనిని దగ్గరకు తీసుకుంది.

ప్రేమగా తలనిమురుతూ ఏమైంది కన్నా!ఏడవకు నాన్న అంటూ గుండెల్లో పొదువుకుంది.ప్రాజెక్ట్ వర్క్ ఇచ్చారు.మా సైన్స్ టీచరు..అది రెడ్ బుక్ డేటా ను స్క్రాబ్ బుక్ లా చేయమన్నాడు అన్నాడు.హా! అయితే..ఏడవాలా అంది ఊపిరిపీల్చుకుంటూ..అది కాదు అమ్మా..ఆ రవిలేడు అతను..అతను..మీకు ఫోన్ లేదు నేనైతే గూగుల్ లో సెర్చ్ చేసి రాసేస్తా అని వెక్కిరించాడు.

అంతే కాదమ్మా..మనం పేదవాళ్ళమటా అతనికి రోజు గుడ్ మార్నింగ్,గుడ్ ఈవెనింగ్ చెప్పాలట..వాడి బుక్స్ నేను మోయాలట అంటూ వెక్కుతున్నాడు.. సరే నేనతనితో మాట్లాడుతా నీవు ఏడవకు.. ప్రాజెక్టు వర్క్ సంబంధించిన విషయాలు.. సైన్స్ ఫిక్షన్స్ లో నేను సేకరించి ఇస్తానని సముదాయించి..అతని చేతిలో తాయిలం ఉంచి ఆడుకోవడానికి పంపింది . రాత్రి వంటకు కూరలు తరుగుతూ ఆలోచనల్లో మునిగి పోయింది.చిన్నతనంలో ఊరిలో పిల్లలు అందరు కలిసిమెలిసి ఆడుకుంటూ..బడిలో చెప్పిన పనులను చేసుకునే వారం.లింగ,మత,స్థాయి భేధాలనేవి ఉండేవా అసలు?? ఈ కాలం పిల్లలు ఎందుకిలా ఎక్కడికక్కడ తమ చుట్టూ గోడలు కట్టుకొని బ్రతుకుతున్నారు.సెల్ ఫోన్ రూపంలో ప్రపంచం మొత్తం అరచేతిలోకి వచ్చింది కాని.మనషి మొబైల్ లో బంధీ అవుతున్నాడు.అన్ని క్షణంలో మనముందు చూపే గూగుల్ ..మమతాను రాగాలు,నిజమైన స్నేహితులను ఇవ్వగలదా..ఎందుకు నెట్టింట్లో వలలో తగులుకున్న చేపలా గిలగిల లాడుతూ..అది ఒక స్టేటస్ లా ఫీలవుతున్నారు.ఎక్కడుంది లోపం అంటూ ... తీవ్రంగా ఆలోచిస్తున్న క్షణంలో...

ఏంటమ్మాయ్ ఏమైంది అలా ఉన్నావు అంటూ వంట ఇంట్లో అడుగుపెట్టిన అత్తయ్య తో జరిగిన విషయం అంతా పూస గుచ్చినట్లు చెప్పగా...అంతేనమ్మా సంపాదన పరమావధిగా కాక పిల్లలతో కాస్త సమయం గడపటం . సంస్కృతి సంప్రదాయాలు గురించి కథలు రూపంలో చెప్తుంటే..మనసు మేల్కొని నిజమైన ప్రపంచాన్ని చూడగలరు..ప్రపంచం అరచేతిలో గూగుల్ రూపంలో ఉన్న..నేర్చుకునే నేర్పరితనం..బ్రతకడం అనేది సంఘటనల అనుభవ సారం అంది.

రేపే పాఠశాలకు వెళ్లి ఉపాధ్యాయుల తో, పేరెంట్స్ తో చర్చించి.. రోజు.. నీతి కథలు చెప్పే ఏర్పాటు చేయాలని నిశ్చయించుకుంది అనిత.



-సి. హేమలత
9666779103

## సమాధానం లేని ప్రశ్న

నేలమీద మిగిలిన గిలకలను చూసుకుని
పాదాల వేళ్ళు కన్నీరు పెట్టుకుంటున్నాయి
పండుగనాడు తలనిండా సుమాలతో అలంకరించుకుని
తన కురుల ఛాయల క్రింద ఎందరికో నీడనిచ్చి
ఉబ్బిన పాదాలను తలగడ చేసి
ఎందరికో సేదదీర్చుకునే అవకాశమిచ్చి
వసంతంలో విస్తృతంగా సింగారించుకున్న మేనిలోని
అందాలను వొలిచి సిగలకు సొగసులద్దుకుంటే
తనవారి కోసం తాను వినియోగపడ్డానని మురిసింది
తన కడుపుతీపిని కోసి కొరుకుతుంటే
నేస్తాల కడుపు నింపుతున్నానని తృప్తిపడింది
ఆ ఆనందం నేడు ఆవిరిగా మారిపోయింది
ఒకే వలయంగా కలిసివున్న తమ గుంపును
మనుషులెవరో వచ్చి మరలతో నేలమట్టం చేశారు
రేపో, మాపో వచ్చి కాలి వేళ్ళతో సహా పెకలించి
ఉనికిని మాయం చేస్తారనగానే తనలో ఉదయించిన ప్రశ్న
"ప్రకృతికి హారమై, మీ ఊపిరులకు ఆయువులమయాము తప్ప
మీ వారసత్వ సంపదలేవీ దోచుకోలేదే
ఆహారాన్ని, ఆరోగ్యమూలికలను, వంటచెరుకును ఇచ్చామే గానీ
మీనుంచి చుక్క నీరు కూడ ఆశించలేదే
మరి ఏ హక్కుతో మమ్మల్ని సమూలంగా నాశనం చేస్తున్నారు?"
ఇది ఒక సమాధానం లేని ప్రశ్నగా మిగిలిపోయింది
మమ్మల్ని మీరు తుడిచిపెట్టడమంటే
మిమ్మల్ని మీరే తుడిచివేసుకుంటున్నామని మరువకండి
తరువు బరువుకాదు, ప్రకృతికి వరమని గుర్తించండి.



-శింగరాజు శ్రీనివాసరావు
9052048706

## చిత్తూరు కవిత్వం - మానవతావాద భావాలు

ప్రకృతి, ఋతువులలో పరిణామాలు, పాలకుల అభివృద్ధి చర్యల మీదనే, చిత్తూరు ప్రజల బ్రతుకులలో కలిగే సుఖ సంతోషాలు ఆధారపడి వుంటాయి.

ఎప్పుడో గానీ వర్షాలు చాలినంతగా కురవని ఈ జిల్లాలో మానవతావాదుల సహాయ చర్యలు ఒక సామాజిక అవసరం. రాయలసీమలో బుడ్డా వెంగళరెడ్డి, థామస్ మన్రోల కాలం నుండి నేటి రాయలసీమ అభివృద్ధి సంఘాల వారు చేసిన, చేస్తున్న కృషి ఆ అవసరాన్ని చాటుతున్నాయి.

ఇటువంటి పరిస్థితుల చేత ప్రభావితులైన చిత్తూరు కవుల కవిత్వంలో మానవతావాద భావాలు విస్తారంగా కనిపిస్తాయి. మానవుల కష్టాలు, సమస్యలు చూస్తూ నిరాశావాదంలోకి, నిస్పృహలోకి జారుకొనే వారిలో తమ కవిత్వంలో ఆశావాదం అంకురం తొడిగేట్లు చేస్తారు కవులు.

"కరువు రక్కసి వద ఘట్టనములు / చీలి బద్దలుగా చిత్తూరు మండల / ప్రజలెల్ల దిక్కులు పర్యులెత్తు" అంటూ, వర్షాభావ పరిస్థితులలో ప్రజల కడగళ్ళను వర్ణించారు కవి సభా.

కరువు పరిస్థితులలో దిక్కుతోచక బ్రతుకు దెరువు కోసం వెదుకులాడుతున్న ప్రజలను ఆదుకోవడానికి అందరూ సిద్ధంకావాలని కాసల నాగభూషణం తన కవితలో అంటారు.

"ఎందుకలా చూస్తున్నావు శూన్యంలోకి / సమాధాన గ్రథనంలో / నవత - సమత/ మమత - మానవతలతో / ప్రశ్నార్థక సంపుటాల్ని / నిండుగా నింపేద్దాం / బీటలు వారిన గుండెమాగాణిపై / ఆశయాల స్వాతి జల్లులే చిలికిద్దాం."

వ్యవసాయం పాక్షిక జీవనాధారంగా ఉన్నప్పుడు ప్రత్యామ్నాయ జీవనోపాధి మార్గాల గురించి కూడా ప్రజలు తెలుసుకోవలసి ఉంటుంది. అటువంటి ఉపాధి మార్గాలు తెలుసుకోవడానికి విద్య సాధనంగా ఉంటుంది.

"పడతి మెడలోని మంగళ సూత్రమమ్మి / నిలిపెగిరిరావు బడిని ఈ నెలవునందు / అదె కళాశాలయై నేడు మదనపల్లె / దివ్య విజ్ఞాన భూమియై తేజరిల్లె".

గిరిరావు మదనపల్లెలో పాఠశాలను నిర్మింపచేసి దాతృత్వాన్ని చాటుకొన్నాడు అని కవి కవి సభా తన కవిత్వంలో అంటారు. అలాగే శ్రీమతి కృష్ణవేణి కణ్ణన్ చేసిన విద్యా సేవలను కూడా కొనియాడారు.

చిత్తూరు కవులు తమ కవిత్వంలో జీవకారుణ్య భావాలను కూడా వ్యక్తీకరించారు.

"చీకటి దొంగలు మూకగ వస్తే / గొంతుక చీల్చుక, అరచిందే / కత్తులు పొడిచినా కర్రలు కొట్టినా / జడియక నిద్దుర లేపిందే /".

మనుషులకు అన్ని సేవలందించే కుక్క అనారోగ్యంతో విలవిలలాడుతుంటే ఎవరూ పట్టించుకోరే యని! కవి రఘునాథ రెడ్డి ప్రశ్నిస్తారు.

అటువంటి మూగ జీవాలను ఆదుకోవలసిన అవసరం గురించి శంకర నారాయణ తన కవితలో ఇలా అంటారు.

"మూగజీవుల బ్రతుకు పెంచుయు / విపిన భూముల నుద్ధరింపుము / తెరపి విడవక వానకురియును తెచ్చు సౌభాగ్యం...!".

వైద్య, ఆరోగ్య సేవలను మామూలు మనిషి కంటే డాక్టర్లు, నర్సులు చక్కగా అందించగలరు. అందుకే మానవత్వం గల డాక్టర్లు, నర్సులు ఈ సమాజానికి అవసరమని అంటారు కవి బి. మునిరత్నం రెడ్డి.

"ఆసుపత్రి లీలలన్నీ... నా కడుపు నిండా ఉన్నాయి / రాయాలంటే చిత్రగుప్తుణ్ణి కావాలి / అవతలిగట్టు చేరే దాక డాక్టర్లే దేవుళ్ళై, నర్సులే / దేవత లైవచ్చు దాకా". వేచి చూస్తాను అని అంటాడు కవి.

ఈ ప్రాంతం రైతులలో మానవత్వం స్వభావాన్ని కవి సభా ఇలా వివరించారు తన కవితలో.

"నా నేల నడయాడు నల్ల చీమనైన / నుపవాసమున్న నేనోర్వలేను / నా పుట్టలో నున్న నాగుబామునకైన / పాలు బోయక దాహమార్చుకోను/ నా చెట్టు కొమ్మపై నర్తించు పిట్టయు / పస్తున్న యడలనే బ్రతుకలేను / నా కొండ కోనలో నడియాడు లేడికిన్ / తిండి లేదన్న నేనుండలేను.

చిత్తూరు కవుల భావాలకు మానవత్వాన్ని ప్రాతిపదికగా ప్రకటించారు కవయిత్రి పి. రాణి.

"ఓ దయ, జాలి, కరుణ గల, ఓ మానవత్వమా / నువ్వు లేక

నా జీవితం ధన్యం కాదు....../ ఓ మానవత్వమా!

నువ్వు లేకపోతే / దిక్కులేని వారికి దిక్కెవరు / నువ్వు

ప్రతి ఒక్కరిలో శ్వాసలాగా మిగలాలి".

మానవత్వం అనేది పేరు, ప్రఖ్యాతులు సంపాదించడం కోసం కాదని, "దిక్కులేని ప్రజల కోసం" దానిని కలిగి వుండాలని కవయిత్రి స్పష్టం చేశారు.

మానవత్వాన్ని ఆచరించడానికి ఎంతో ధైర్యం, ఓరిమి కావాలి. ఆత్మ విశ్వాసం, పోరాట పటిమ కావాలి.

"భయంకర శోక సాగరాలుప్పొంగి / కరాళనృత్యంగా యెదుట గావించినా / పడవలా సాగుతాను -నేను / సుదూర పయనమే చేస్తాను".

కష్టాలొస్తే కసిని పెంచుకొని ఉన్మాదిగా మారకూడదు. ఓర్పుతో, ధైర్యంతో ముందడుగెయ్యాలని అంటారు తన కవితలో ఎ.జి. ఎతిరాజులు.

మానవత్వం సమస్యల పట్ల స్పందించే గుణం లేని మనిషి బండరాయితో సమానం అని అంటాడు కవి ఎస్.గిరిధర్.

"నాకెందుకులే అనుకొంటివా / నిన్ను కన్నతల్లికి ఈ పుణ్యభూమికి / నీవు మోసం చేస్తున్నట్లే - గుర్తించుకో అందుకే../ నాకెందుకులే అనే మాటను / నీ మనసు నుండి తొలగించేసి / సమాజాభివృద్ధి జరిగే ప్రతి చోటా నీ ఉనికి చాటుకో".

**ఎప్పుడో గానీ వర్షాలు చాలినంతగా కురవని ఈ జిల్లాలో మానవతావాదుల సహాయ చర్యలు ఒక సామాజిక అవసరం.**

సంఘ సేవలో నీతిలేని నకిలీ సేవకులు పుట్టుకు రావడాన్ని కవులు గమనించారు. నాగరికత పెరిగి సమాజంలో నీతి తగ్గిపోయిన వైనాన్ని తన కవితలో ఇలా పేర్కొన్నారు కవి రామకృష్ణ.

"పొంగగా నాగరికత క్రుంగె నీతి / పెరిగె నటనలు సహజము తరిగిపోయె / వీని నా పెడు మార్గంబు వెదకలేక".

ఈ ధోరణిని ఆపడానికి పూనుకొని -

"శస్త్ర చికిత్సలు చేస్తాము / మీ గుండెలనే మారుస్తాము / మీలో మానవత్వాన్ని పోస్తాము" అని అంటాడు.

మనుషులంతా వుండేది ఒకే ప్రపంచంలోనైనా, కవులు మాత్రం తమ మనస్సులలో బహుళ ప్రపంచాలను దర్శించగలరు.

తారామండలం, ఖగోళమండలం, వాయు మండలం, బ్లాక్‌హోల్ మండలం, సూర్య మండలం - ఇలా విశ్వంలో అనేక మండలాలున్నాయి.

కవి వీటన్నిటితో భావ సాంగత్యం పెంచుకొంటాడు. మానవ ప్రపంచానికి సంబంధించి రసానుభూతిని, ప్రేమానుభూతిని, గాఢంగా పొందాలనుకొంటాడు. ఈ కవి అంతటితో ఆగితే సామాన్య భావుకునిలా మిగిలిపోతాడు. కవి తన వ్యక్తిగత భావ పర్యావరణాన్ని దాటి ప్రక్కవాడి జీవితంలోకి తొంగిచూస్తాడు.

ఇలా చెయ్యాలంటే కవికి మానసిక ఔన్నత్యం ఉండాలి. స్వార్థాన్ని, వ్యక్తిగత సౌఖ్యాన్ని ఒక ప్రక్కకు నెట్టివేసే ధైర్యం ఉండాలి.

చిత్తూరుకు చెందిన మరొక కవి నూతలపాటి గంగాధరంలో ఇటువంటి ధోరణి కనిపిస్తుంది. తన కవిత్వంలో గంగాధరం సృష్టించిన మనిషి - హరివిల్లులు, రసగీతాలు, మధుర సంగీతం, మంచులో తడిసిన మల్లెలులతో కూడుకొన్న వాతావరణంలో ఒక శక్తికి అర్చన చెయ్యాలని బయలుదేరుతాడు.

అంతలోనే ఆ మనిషికి బుద్ధునికి కపిలవస్తు నగరంలో కనిపించిన 4 విషాద దృశ్యాల్లాంటివి కనిపిస్తాయి. అతని మనసు రసానుభూతి అర్చన భావాలనువదలి మానవత్వం భావాల వైపు పరుగెడుతుంది వడివడిగా!

"తల్లిలేని పిల్ల ఏడుపూ / చెమట నుంచి లేచిన నిప్పుల గాడుపూ / ఈడొచ్చినా తోడు కరువైన / వయసు పిల్ల నిట్టూరుపూ / ఆడ పిల్లల తండ్రి కడుపు చెరువూ / దగాపడ్డ చెల్లెమ్మల గుండెబరువూ / ప్రశ్నార్థకపు గుర్తులై అడ్డు నిలిచాయి / భరించలేని బాధలై గుండె తొలచాయి".

కవి హృదయం వెన్నకంటే మృదువైనది. పట్టుదల పెరిగిందో అతని మనసు వజ్రం కంటే కఠినంగా మారుతుంది. ఇక అతను సాధించాలనుకొన్నది నెరవేరే వరకు పయనం, పోరాటం ఆగదు.

అందుకే కవి దేవునితో ఇలా అంటాడు.

"భగవాన్ నన్ను క్షమించు / వాళ్ళను వదలి ఇలా అలంకరించుకొని / ఒంటరిగా నీ చెంతకు రాలేను / వీళ్ళతో పాటే నేనూ / వాళ్ళందరినీ అర్చనకు వచ్చే / శుభ ఘడియ ఎపుడు వస్తుందో / అప్పుడే నేనూ వస్తాను - వీళ్ళతో పాటు / అంతవరకూ వీళ్ళ సేవే నా అర్చన / వీళ్ళ పాద ధూళే నా అలంకారం."

చిత్తూరు జిల్లాలో నాగరికత ఆకర్షణలు, దైవిక ఉత్సవాలు కవులకు చాలా సమీపంలోనే వుంటాయి. అదే సమయంలో వీరి మీద బ్రహ్మంగారు, వేమనతత్త్వాలు, పద్యాల ప్రభావమూ ఉంటుంది.

అందుకే వారికి వ్యక్తిగత భావాలకు సామాజిక భావాలకు మధ్య తేడాలు బాగా తెలుసు.

తెలుగు సాహిత్య పరిణామాల రహదారిలో, వ్యక్తిగత భావాలను అధికమించిన ఈ కవుల మానవతావాద కవిత్వం, ఒక మైలురాయిగా నిలుస్తుంది.


**ఆధార గ్రంథాలు:**

1. "వేద భూమి"కవిత్వం
రచన: కె. సభా,
శ్రీ రమణ ప్రచురణలు, చిత్తూరు, 1974
2. "కవితామంజరి"
చిత్తూరు జిల్లా రచయితల సంఘం
ప్రచురణ, చిత్తూరు, 1975
3. "కవితా సుమాలు"
చిత్తూరు జిల్లా రచయితల సంఘం
చిత్తూరు, ప్రచురణ, 2004




-బి. శంకరరాజు
సెల్: 9440508511

---

## మాతృ దేవోభవ

అమ్మప్రేమఅంతులేనిసంపద
అమ్మ ఒడిలోని వెచ్చదనం
అమ్మ దనంలోని కమ్మదనం
అమ్మ అనే తీయనిపదం
తేనెలూరే మమతల మూట,
తన గర్భస్థ శిశువుకు....
రక్తమాంసాలను పంచి
ఓ రూపాన్ని ఇచ్చిన అమ్మ
బిడ్డభూమిమీదపడినమరుక్షణం
తన క్షీర సాగరాన్నిబిడ్డనోటికి
తన్మయత్వంతో మైమరచి
మురిసిపోతుందిఅమ్మ,
అందుకే మాతృభూమి,
మాతృభాష,మాతృసంస్కృతి
అంది వేదం,
ప్రతి శిశువు మొదటిసారిగా
పలికే మాట అమ్మ,
నేటి పాశ్చాత్య పైత్యం కల్గిన
తల్లులు 'అమ్మా'అనిపిలుపిం
చుకోడానికి
వెనకంజ వేస్తున్న రోజులివి,
తల్లిని మించిన దైవం లేదు,
తల్లిని మించిన వస్తువులేదు
తొలిమాటను పలికించేది అమ్మ,
తొలి అడుగు వేయించేది అమ్మ,
బిడ్డకు తొలిగురువు అమ్మ,
అందుకే మాతృదేవో భవ
అన్నది వేదం"



-రాయవరపు సరస్వతి
9885656356

## హరిత హారం...

భూ కబ్జాదారుల సర్పాల మెడల్లో
హరిత వనం బంగారు హారంగా మారి,
బక్కచిక్కిన రైతు మెడలో ఉరిలా ఆయువు తీసే,

పొలాలన్నీ మారే బీడు భూములుగా,
సర్పాల విష రసాయనాల వల్ల,
భూమాత గర్భ శోకంతో గొడ్రాలుగా విలపించే,

పచ్చని పుడమి స్వర్గమంతా,
యముడి పాశపు కర్కషత్వంతో నిండే,
ఎండిపోయిన ప్రాణం పోయే నరకానికి

తన వేర్లు దర్భలు సమిధలుగా మారే,
ప్రమిదలో నీరు అనే వత్తిని వెలిగిస్తే,
దీపంలో కాంతిగా మారి ఆయువు పంచుతా...

ధరిత్రి పచ్చని తోరణంలా మారితే,
ఆయుష నిచ్చే జీవ రాశికి,
అందుకే ఒక్క మొక్క నాటుదాం
భూమాత బిడ్డల్ల మారదాం...



-డాక్టర్. సతీష్ ఎర్ర
9866136543

## కాకి బ్రతుకా వద్దు? హంస బ్రతుకే ముద్దు?

ఓ నా ప్రియమిత్రమా !
ఎంతకాలమిలా నీవు
అజ్ఞానంలో అంధకారంలో
అమాయకత్వంలో దగ్ధమైపోతావ్.....

ఇకనైనా ఈ కరోనాకాలంలోనైనా
ఊపిరాడని నీ బలహీనతల
ఊబినుండి బయట పడాలనుకో...
నీ తరతరాల బానిసత్వపు
ఉక్కుసంకెళ్ళను త్రెంచాలనుకో...

శిలను శిల్పంగా చెక్కాలనుకో...
ఎవరెస్టు శిఖరాన్ని ఎక్కాలనుకో ...
నీకులదైవం అంబేద్కర్ కు మ్రొక్కాలనుకో...

పక్షిలా నిన్ను పైకి ఎగరనీయకుండా
పచ్చని మొక్కలా ఎదగనీయకుండా
అడుగడుగునా అడ్డుపడిన
అణగదొక్కిన అహంకారులకు
నీవు సింహస్వప్నమవ్వాలనుకో...
చీడపురుగుల్ని చీల్చిచెండాడాలనుకో...

కామంధుల కాలికింది చెప్పులా ఆ
చెప్పుకింది తేలులా బ్రతకాలనుకోకు...
వారి మెడమీద వ్రేలాడే పదునైన కత్తిలా
వారికి ప్రక్కలో బల్లెంలా బ్రతకాలనుకో...

ఆకులు మేసే అమాయకపు మేకవై పోకు
గర్జించే సింహంలా గజరాజులా బ్రతకాలనుకో...
ఆరక రగిలే అగ్ని జ్వాలలా...దహించాలనుకో...

ఓ నా ప్రియమిత్రమా !
కాకిలా కలకాలం బ్రతికినా
కడకు దొరికేది కాటిలో పెట్టిన పిండమే...
అందుకే హంసలా కొద్దికాలం బ్రతికినా
పులిలా పోరాడి గెలిచినా
అందుకోగలవు భారత రాజ్యాంగ నిర్మాత
డాక్టర్ బి ఆర్అంబేద్కర్ అందించే
హక్కుల అమృతభాండమే...



- పోలయ్య కవి కూకట్లపల్లి
9110784502

## గజల్ -మావిచిగురు

హరితవనపు సోయగమే తనదన్నది మావిచిగురు..
కోకిలమ్మ రాగాలకు నెలవన్నది మావిచిగురు...

శిశిరాలను వీడితేనె వాసంతం యేతెంచును
చిరుఆశలు మొలకెత్తెను చూడన్నది మావిచిగురు...

పూబాలల మకరందం మధుపాలకు ఆహ్వానం..
మరుమల్లెల గుబాళింపు తనకన్నది మావిచిగురు...

కష్టమైన ఇష్టమౌను కంటిపాప భవితకొరకు
చెట్టుకు పిందెలు భారం కాదన్నది మావిచిగురు..

చిరుఆశల పత్రములే చిగురించును చైత్రంలో
కలలకెపుడు అంతమేమి లేదన్నది మావిచిగురు...

రాచిలుకల పలుకులకు నందనవని మురియునుగా
చెలికత్తెల స్నేహానికి ముందన్నది మావిచిగురు..

పట్టుదలకు ప్రాణమొస్తె స్వప్నాలే సత్యమౌను
పండుగవేళన తానే అతిథన్నది మావిచిగురు..



-ఓస్వప్నకృష్ణ
9440536669

